సాక్షి ఖమ్మం

సోమవారం ၊ 13 ၊ మార్చి ၊ 2023



క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యనభ్యసించాలని ఎస్సీ శాఖ డీడీ సత్యనారాయణ సూచించారు. 8లో



సంఘాల ప్రగతిపై ఆరా..

స్వయం సహాయక సంఘాల ప్రగతిని తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం లఖ్‌పతి దీదీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి, తెల్లవారుజామున కొంత చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్‌

నేడు ఖమ్మంలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్‌: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ సోమవారం ఖమ్మంలో పర్యటించనున్నట్లు క్యాంప్‌ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.10 గంటలకు 14వ డివిజన్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తారు. 10.30 గంటలకు 10వ డివిజన్‌ ఇందిరా నగర్‌ ప్రభుత్వ పాఠశాలలో, 10.50 గంటలకు సంభానినగర్‌, 19వ డివిజన్‌లో 'మన బస్తీ – మన బడి' కార్యక్రమంలో పాల్గొంటారు. 11.05 గంటలకు 18వ డివిజన్‌ శ్రీరామ్‌ నగర్‌, సాయంత్రం 4 గంటలకు ఎన్‌ఎస్‌ క్యాంపు ఫ్రీడమ్‌ పార్కులో 58 జీఓ కింద ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు.

ఈనెల 20 వరకు 30 పోలీస్‌ యాక్ట్‌

ఖమ్మంక్రైం : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నేటి నుంచి ఈనెల 20 వరకు ఖమ్మం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 30 పోలీస్‌ యాక్ట్‌ అమలులో ఉంటుందని సీపీ విష్ణు ఎస్‌ వారియర్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంక్షలు అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. గుంపులుగా తిరగటం నిషేధమని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నివాస, వాణిజ్య ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాలలో పరిమితికి మించి శబ్దం చేసే డీజేలకు అనుమతి లేదని తెలిపారు.

అన్నారుగూడెం వాసికి డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న కనకదుర్గ

తల్లాడ: తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన యలగందుల కనకదుర్గకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. అన్నారుగూడెం పాఠశాలలో చదివి హైదరాబాద్‌ కోటి ఉమెన్స్‌ కళాశాలలో ఎంఏ (తెలుగు)లో ఉత్తీర్ణత సాధించిన కనకదుర్గ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ పట్టా పొందారు. కుల వృత్తులపై ఆమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ లభించింది. ఈ సందర్భంగా తెలుగు విభాగం ఆచార్యులు ప్రొఫెసర్‌ సాగి కమలాకరశర్మ, తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ప్రొఫెసర్‌ వారిజా రాణి కనకదుర్గను అభినందించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

భూ పోరాటాలకు సిద్ధం కండి

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): ప్రభుత్వ భూములను ఆదివాసీలకు పంపిణీ చేయాలని అదివాసీ ఐకాస కన్వీనర్‌ వాసం రామకృష్ణదొర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆదివాసీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పాల్వంచ, ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములన్నీ బడా గిరిజనేతరుల కబ్జాలో ఉన్నాయని, ఆ భూములన్నింటినీ భూపోరాటం చేసి ఆదివాసీలకు, పేదలకు ఇళ్ల స్థలాల రూపంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇళ్లులేని పేదలంతా భూపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసీ ఐకాస నాయకులు పూనెం పద్మ, కోరెం కాంతమ్మ, వజ్జ శ్రీను, కుంజా రవి, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అరకొర..
నీటి సరఫరా ఎలా?

- జల వనరుల శాఖలో క్షేత్రస్థాయిలో ఉద్యోగుల కొరత
- 700 మందికి గాను ఉన్నది 102 మందే..
- ఫలితంగా నీటి సరఫరా పర్యవేక్షణలో ఇబ్బందులు
- చివరి ఆయకట్టుకు జలాలు అందక రైతుల ఆందోళనలు



బోనకల్‌లో ఎన్నెస్పీ కెనాల్‌ బ్రిడ్జిపై రాస్తారోకోకు దిగిన రైతులు (ఫైల్‌)

ఖమ్మంఅర్బన్‌: జిల్లా జల వనరుల శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. సరిపడా ఉద్యోగులు లేక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ భారంగా మారుతోంది. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగర్‌ జలాలు అందడం లేదు. నాగార్జున సాగర్‌ ఎడమకాల్వ, మేజర్లు, మైనర్లు తదితర కాల్వల చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా చేరడంలో లష్కర్లు ప్రధానపాత్ర పోషిస్తారు. వీరితోపాటు వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు, జేఈలు తగినంత మంది ఉంటే నీటి సరఫరాను పర్యవేక్షించవచ్చు. జిల్లాలో జలవనరుల శాఖ నిబంధనల ప్రకారం 700 మంది లష్కర్లకు గాను ప్రస్తుతం 102 మంది మాత్రమే ఉన్నారు. సాగర్‌ ఎడమ కాల్వ ప్రవహించే సూర్యాపేట, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో లష్కర్ల కొరతతో ఉన్న వారిపైనే భారం పడుతోంది. గత 15 ఏళ్లుగా లష్కర్ల నియామకం లేకపోగా.. ఏటా కొందరు ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకు నీరందక..

సిబ్బంది కొరత కారణంగా చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. వారబందీ విధానంలో నీరు విడుదల చేస్తున్న తరుణాన చివరి ఆయకట్టుకూ నీరు చేరేలా లష్కర్లు పర్యవేక్షించాలి. అలాగే, ఎక్కడైనా కాల్వలు మరమ్మతుకు గురైనా, ఇతర సమస్యలు ఎదురైనా గుర్తించి ఉన్నతాధికారులకు చేరవేయాలి. కాల్వ కట్టలపై ఉండే చెట్లు నరకడం, ఎక్కడన్నా గుంతలు పడితే పూడ్చడం, గేట్లు ఎత్తడం, దించడం, కాల్వలో చెత్తాచెదారం లేకుండా చూడడం, మృతదేహాలు, జంతువుల కళేబరాలు తీసివేయడం.. నీరు సరిగా పారేలా చూడటంలో కీలకంగా వ్యవహరించడం వీరి బాధ్యత. తద్వారా నీటి నష్టం లేకుండా సాఫీగా దిగువకు పారుతుంది.



తూముల వద్ద పర్యవేక్షిస్తున్న ఉద్యోగులు (ఫైల్‌)

నియామకాలు జరిగితేనే..

తెలంగాణ ఏర్పడ్డాక నీటిపారుదల శాఖను పునర్వ్యవస్థీకరించారు. అన్ని శాఖలను జల వనరుల శాఖగా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. అందుకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. సరిపడా సిబ్బంది ఉంటే వచ్చే నీటిని సక్రమంగా పంట పొలాలకు చేర్చే విషయంలో మంచి ఫలితాలు నమోదవుతాయి. కానీ అలా జరగకపోవడంతో జిల్లాలోని సాగర్‌ చివరి ఆయకట్టుకు నీరు చేరక పంటలు ఎండిపోతుండడం, రైతులు ఆందోళన చేయడం సర్వసాధారణంగా మారింది.

అసలైతే ఇదీ లెక్క!

- జల వనరుల శాఖ లెక్కల ప్రకారం ప్రతీ 1,500 ఎకరాల ఆయకట్టు పర్యవేక్షణకు ఒకరు, రెగ్యులేటర్‌కు ఇద్దరు, ప్రధాన, బ్రాంచ్‌ కాల్వల్లో ప్రతీ ఆరు కిలోమీటర్లకు ఒక లష్కర్‌ ఉండాలి. దీని ప్రకారం పరిశీలిస్తే జిల్లా ఆయకట్టు ఆధారంగా 700 మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా ప్రస్తుతం 102 మందే ఉన్నారు. అంటే 10 వేల ఎకరాలకు ఒకరు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో కూడా పలువురు ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారు.
- జిల్లాలో కనీసం 60 మంది వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. కానీ 30 మంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు.
- ఇక జేఈల కొరత కూడా తీవ్రంగానే వేధిస్తోంది. ప్రతీ డివిజన్‌కు పది మంది చొప్పున ఉండాల్సి ఉండగా.. కేవలం ఇద్దరు చొప్పునే ఉన్నారు.
- ఇలాంటి పరిస్థితిలో ఉన్న సిబ్బందే జిల్లాలోని సుమారు ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరాను పర్యవేక్షించాల్సి వస్తోంది.

ఉన్నంతలోనే శ్రమిస్తున్నాం..



లష్కర్లు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు, జేఈల కొరతతో నీటి సరఫరాలో ఇబ్బంది ఎదురవుతోంది. సరిపడా సిబ్బందిని నియమిస్తే మంచి ఫలితాలు రాబట్టొచ్చు. అయినా ఉన్నంతలోనే కష్టపడి పని చేస్తున్నాం. – ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ, పాలేరు

పని భారం పడుతోంది..



లష్కర్లు సరిపడా లేక పది మంది చేయాల్సిన పని ఒక్కరే చేయాల్సి వచ్చి ఒత్తిడి పెరుగుతోంది. ఉన్న వారు కూడా ఉద్యోగ విరమణ పొందుతున్నారు. వచ్చే జూలైలో నేను కూడా రిటైర్‌ అవుతున్నా. – నాగేశ్వరరావు, లష్కర్‌

లష్కర్లు లేకపోవడంతోనే ఇలా...




కాల్వ నీటిని మొదటి రైతులు ఎక్కువగా వాడుకుంటున్నారు. అదే లష్కర్లు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు ఉంటే వారిని కట్టడి చేయొచ్చు. కానీ ప్రశ్నించే వారు లేక మాలాంటి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – మంకెన నాగేశ్వరరావు, రైతు, నేరడ

సాగర్‌ నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో.. 8లో

మద్యం మత్తు.. యువత చిత్తు..

- చిన్నచిన్న అంశాలకే గొడవలు.. కేసులు
- కొన్ని చోట్ల ప్రాణాల మీదకు తెస్తున్న ఘర్షణ
- పోలీసులు దృష్టి పెట్టాలని ప్రజల వేడుకోలు



- ఐదు నెలల క్రితం పొట్టచేత పట్టుకుని ఉత్తరప్రదేశ్‌ నుంచి ఇద్దరు స్నేహితులు ఖమ్మం వచ్చారు. ఈక్రమంలో ఓరోజు మద్యం మత్తులో వారి నడుమ ఏ రైల్వే స్టేషన్‌ పెద్దది అనే అంశంపై వాదన మొదలై వాగ్వాదానికి దారి తీసింది. ఆతర్వాత గొడవ పెద్దదై జరిగిన ఘర్షణలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. ఇంకొకరు జైలు పాలయ్యారు.
- నెల క్రితం ఇద్దరు స్నేహితుల మధ్య పెట్రోల్‌ విషయంలో జరిగిన గొడవలో చిన్ననాటి స్నేహితుడనే విషయాన్ని మరిచి పెట్రోల్‌ పోసి తగులబెట్టాడు. ఒకరి ప్రాణాలు పోవడానికి కారణమైన ఈ ఘర్షణ కూడా మద్యం మత్తులోనే జరిగింది.
- ఖమ్మంలో మూడురోజుల క్రితం మద్యం మత్తులో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ కాస్తా ఇద్దరిపై హత్యాయత్నానికి దారితీసింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్యం ఎక్కడో అక్కడ జరుగుతున్నాయి.

ఖమ్మంక్రైం: ఇటీవల కాలంలో ముఖ్యంగా యువకులు పెడదోవ పడుతున్నారని చెప్పొచ్చు. తెల్లవార్లూ రోడ్లపై మద్యం సేవించి తిరుగుతూ ఘర్షణ పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇందులో కళాశాలలో చదివే విద్యార్థులు మొదలు ఉద్యోగాలు చేసే వారి వరకు ఉన్నారు. మద్యం సేవించడాన్ని సరదాగా తీసుకుంటున్న వీరు అర్ధరాత్రి వరకు ఆ మత్తులో తూలుతూ జీవితాలు పాడు చేసుకుంటున్నారు.

బర్త్‌డే పార్టీలంటూ హల్‌చల్‌

బర్త్‌డే పార్టీల పేరిట అలవి కాని పనులు చేయడం జిల్లా కేంద్రాన్ని దాటి పట్టణాలు, మండలాలు, గ్రామాలకూ చేరింది. యువకులు మద్యం సేవించి అర్ధరాత్రి వేళ రోడ్లపై కేక్‌లు కోయటం.. మద్యం మత్తులో బాణాసంచా కాల్చటం వంటి ఘటనలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేంటని ఎవరైనా అడిగితే దాడులు చేయడానికీ వెనుకాడటంలేదు. ఇక వివాహాల ఊరేగింపుల్లో అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. ఈ విషయంలో పోలీసుల సూచనలు సైతం ఖాతరు చేయడం లేదనే విమర్శలున్నాయి. ఇక శివారు ప్రాంతాల్లో మద్యం మత్తులో ఆకతాయిలు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. ఆ దారి గుండా భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని పరిస్థితులు కల్పిస్తున్నారు. అదే విధంగా ఒంటరిగా వెళ్తున్న పురుషులను సైతం అడ్డగించి మద్యం, గంజాయి మత్తులో ఉన్నవారు బెదిరించి దోపిడీకి పాల్పడుతున్నారు. అడ్డుచెబితే తీవ్రంగా గాయపరుస్తుండడం కొందరు యువకులు దారి తప్పుతున్న తీరుకు దర్పణం పడుతోంది.

పట్టించుకోని తల్లిదండ్రులు..

రోడ్లపై అర్ధరాత్రుళ్లు బర్త్‌డే పార్టీలు అంటూ వెళ్తున్న వారిని వారి తల్లిదండ్రులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినపడుతున్నాయి. తెల్లవార్లూ ఇంటికి రాకపోయినా, వారు మద్యం సేవించి వస్తున్నా చూసీ చూడనట్లు వదిలేస్తుండడంతో యువకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. తల్లిదండ్రులు ఓ కన్నేసి నియంత్రిస్తే వారి జీవితాన్ని బాగుపర్చిన వారవుతారని చెప్పవచ్చు. అదే విధంగా పోలీసులు సైతం రాత్రిళ్లు పెట్రోలింగ్‌ పెంచాలని.. తద్వారా తెల్లవార్లూ రోడ్లపై మద్యం మత్తులో తిరిగే ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- భద్రాద్రి జెడ్పీ చైర్మన్‌ కోరం కనకయ్య, ఎన్డీ నేత మధు
- ముగిసిన న్యూడెమోక్రసీ పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్‌ కోరం కనకయ్య, ఇతర రాజకీయ పక్షాల నాయకులు

ఇల్లెందురూరల్‌: ప్రజల ఆకాంక్ష అయిన కొమరారం, బోడు నూతన మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జెడ్పీ చైర్మన్‌ కోరం కనకయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పేర్కొన్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్‌ కోసం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారంతో ముగిసింది. తొమ్మిదిరోజులపాటు వివిధ గ్రామాల్లో యాత్ర సాగింది. చివరి రోజు కొమరారం నుంచి ఇల్లెందు వరకు 18 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. కొత్తబస్టాండ్‌ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్‌ కోరం, మధు తదితరులు ప్రసంగించారు. సదుపాయాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వివక్ష చూపడం వల్లే కొమరారం, బోడు మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్‌ ఆచరణకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్వే చేసిన ప్రభుత్వం కేవలం ఎంపీటీసీలు తక్కువగా ఉన్నాయనే సాకుతో ఆచరణలో పెట్టడం లేదని ఆక్షేపించారు. చిన్న సమూహాలను మండలాలుగా, రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తున్న ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోకాళ్ళ కృష్ణ, బానోత్‌ సంతు, రజిత, పాయం స్వాతి, కల్తి పద్మ, వాంకుడోత్‌ సరోజిని, ఎంపీటీసీలు మండల రాము, పాయం కృష్ణప్రసాద్‌, నాయకులు పొడుగు నర్సింహారావు, కాంతారావు, మోతీలాల్‌, సూర్నపాక సత్యనారాయణ, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మంచె రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు 'చేనేత' కానుకలు..

- సీతారాములకు పట్టువస్త్రాలను నేస్తున్న వృత్తిదారులు
- 4,600 పట్టు పోగులు, 5 రంగులతో ప్రత్యేకంగా..
- భద్రాచలంలో లాంఛనంగా నేత పనులు ప్రారంభం

భద్రాచలం: భద్రాచలంలో జరిగే శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణం, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలను భక్తులు ఎంతో విశిష్టంగా భావిస్తుంటారు. ఈ పుణ్యకార్యంలో భాగస్వాములవటం పుణ్యఫలమని విశ్వసిస్తారు. ఈ క్రమంలోనే గతేడాది నుంచి చేనేత కార్మికులు స్వామివారి కల్యాణం, పట్టాభిషేకానికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారు.

పోచంపల్లి పట్టువస్త్రాలు..

శ్రీ సీతారాముల కల్యాణానికి, పట్టాభిషేకానికి తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘ ఆధ్వర్యంలో గతేడాది పోచంపల్లి పట్టువస్త్రాలను నేసి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌ రెడ్డికి అందించారు. ఈ ఏడాది సైతం సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి పట్టువస్త్రాలను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. రెండు రోజుల క్రితమే భద్రాచలం చేరుకున్న చేనేత వృత్తిదారులు రంగనాయకుల గుట్టపైన ఉన్న శ్రీ భక్తరామదాసు జ్ఞానమందిరంలో మగ్గం ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం అంతరాలయంలో స్వామివారికి పూజలు చేసి నేత పనులు లాంఛనంగా ప్రారంభించగా, ఏఈఓ శ్రావణ్‌కుమార్‌ పర్యవేక్షిస్తున్నారు.

4,600 పట్టు పోగులు, ఐదురంగుల్లో వస్త్రాలు

కల్యాణంలో పెళ్లి కుమారుడు, పెళ్లి కూతురు వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. సంప్రదాయబద్ధంగా అలంకరించి స్వామి వార్లను ముస్తాబు చేసేందుకు చేనేత కార్మికులు అందమైన రంగులతో వస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. సీతమ్మవారికి 4,600 పోగులతో, ఐదు రంగులతో మిళితమైన జాకెటుతో కూడిన చీరను నేస్తున్నారు. ఇది ఆరున్నర మీటర్లు ఉండి సుమారు 600 గ్రాముల బరువు ఉంటుందని అంచనా. కల్యాణం రోజు గంధం రంగుతో కూడిన చీర, పుష్కర పట్టాభిషేకం రోజు పసుపు, ఎరుపు రంగుల మిశ్రమంతో కూడిన చీరలను ప్రత్యేకంగా నేస్తున్నారు. రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి 4 మీటర్ల పొడవుతో పంచెలు, రెండు మీటర్ల పొడవుతో కండువాలు తయారు చేస్తున్నారు. ఒక్కొక్కరికి 4,600 పోగులతో వస్త్రాలను నేయనున్నారు.

శీనన్న మీ బిడ్డ.. ఆశీర్వదించండి



సత్తుపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పొంగులేటి అభిమానులు

- కేసీఆర్‌ను ఇంటికి పంపించడం ఖాయం
- అధికారం ఎవరి సొత్తూ కాదు
- ఆడబిడ్డల ఉసురు తగులుతుంది
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

సత్తుపల్లి: 'నేను ఇక్కడే పుట్టి పెరిగా.. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు నేనేంటో తెలుసు.. నన్ను రైతుబిడ్డగా గుర్తించారు.. ఎంత సంపాదించామన్నది కాదు.. ప్రజలకు ఏం చేశామన్నదే ముఖ్యం.. మీ శీనన్నను ఆశీర్వదించండి..' అని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం స్థానిక సిద్దారం రోడ్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్‌ మువ్వా విజయబాబు అధ్యక్షతన ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాలు.. రెండు పర్యాయాలు అనేక మంది పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని నేడు రూ.5 లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో లిక్కర్‌ ఆదాయం ఏడాదికి రూ.8వేల కోట్లు ఉంటే.. బంగారు తెలంగాణలో రూ.40 వేల కోట్లు చేసి ఆడబిడ్డల ఉసురు తీసింది నిజం కాదా అని ప్రశ్నించారు. 36 లక్షల మంది రైతులకు రూ.లక్ష చొప్పున రుణమాఫీ చేస్తామని 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారని, అధికారంలోకి వచ్చాక కేవలం 5 లక్షల మందికే రుణమాఫీ చేసి, మిగిలిన 31 లక్షల మందిని వదిలేశారని అన్నారు. నాలుగున్నరేళ్లలో చేయలేని పనిని ఈ ఏడు నెలల్లో ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎనిమిదిన్నరేళ్లలో ఎంతమందికి డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు ఇచ్చారో కేసీఆర్‌ ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకుంటే మొదట రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించి, ఆ తర్వాత రూ.3లక్షలు అంటూ కేబినెట్‌లో తీర్మానం చేశారని చెప్పారు. ఇప్పుడు అవి కూడా మొదట రూ.లక్ష, ఆ తర్వాత రూ.2 లక్షలు ఇస్తామని చెబుతున్నారని, ఇలాంటి మాయమాటలను ఎవరూ నమ్మరని అన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

శీనన్న అభ్యర్థులను గెలిపించుకుంటారు..

అధికారం ఎవరి సొత్తూ కాదని, సత్తుపల్లి నియోజకవర్గంలో ఎంతో మంది హేమాహేమీలను ఓడించారని గుర్తు చేశారు. పొంగులేటి సభకు వెళితే డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇవ్వమని, సంక్షేమ పథకాలు రానివ్వమని బెదిరిస్తున్నారని, శీనన్న ఒంటరి వాడు కాదని అన్నారు. పంచాయతీకి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉంచారని, నిధులన్నీ ఇస్తే సర్పంచ్‌లు తన వెంట వస్తారని భయపడుతున్నారని, ఎవరేం చేసినా సమయం వచ్చినప్పుడు తన గూటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. జెండా, గుర్తు, పార్టీ ఏదైనా తాను నిలబెట్టిన అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని అన్నారు. సమావేశంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్‌ కోరం కనకయ్య, రాష్ట్ర మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ బొర్రా రాజశేఖర్‌, వైరా మున్సిపల్‌ చైర్మన్‌ సూతకాని జైపాల్‌, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, జారె ఆదినారాయణ, బేబీ స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య, నారపోగు వెంకటేశ్వరరావు, మొండెం కిరణ్‌కుమార్‌, మందపాటి ముత్తారెడ్డి, దూదిపాల రాంబాబు, కాలేని రాజేష్‌, కొత్తూరు కోటేశ్వరరావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, చల్లారి వెంకటేశ్వరరావు, పిల్లి నవజీవన్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు, ట్యాంకర్ ఢీ



పాక్షికంగా దెబ్బతిన్న వాహనాలు

ఖమ్మంక్రైం: ఆర్టీసీ బస్సు, పెట్రోల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటన ఆదివారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఏన్కూర్ నుంచి ఖమ్మం బస్టాండ్‌కు వస్తున్న పల్లెవెలుగు బస్సు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న సిగ్నల్స్ వద్ద యూటర్న్ తీసుకోని వరంగల్ వైపు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ట్యాంకర్‌ను డివైడర్‌కు ఢీకొట్టడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సు, లారీల ముందు భాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్సులోని ఎనిమిది మంది ప్రయాణికులతోపాటు రెండు వాహనాల డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి. పెట్రోల్ ట్యాంకర్ కావడంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని వాహనదారులు ఆందోళన చెందారు.

'కోణార్క్' నుంచి గంజాయి స్వాధీనం

- తనిఖీల్లో దొరకని నిందితులు



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

మధిర: మధిర నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఆదివారం నిర్వహించిన ఈ తనిఖీల్లో ఎనిమిది బ్యాగుల్లో.. 36 ప్యాకెట్లలో పెట్టిన 64 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆ గంజాయిని తరలిస్తున్న నిందితులు మాత్రం దొరకలేదని ఎక్సైజ్ సీఐ కె.నాగేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రశేఖర్, డీటీఎఫ్ ఎస్‌ఐ అచ్చారావు, సిబ్బంది ఖాసీం, లాలు, గోపయ్య, వలరాజు, లాజర్, రియాజ్, ముస్తఫా, జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

19న 'రాయల' సంతాప సభ



మాట్లాడుతున్న కమ్మకోమటి నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: గుండెపోటుతో మృతిచెందిన పిండిప్రోలు సర్పంచ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకులు రాయల నాగేశ్వరరావు సంతాప సభను ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు తెలిపారు. పిండిప్రోలులోని రాయల వెంకటనారాయణ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి వివిధ గ్రామాల్లో సంతాప సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు గిరి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఆరెంపుల వెంకన్న, తుపాకుల నాగేశ్వరరావు, ఎడ్లపల్లి నవీన్, వెంకటస్వామి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

వేంసూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని భీమవరంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సుంకర పెద్దపుల్లారావు ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పారు. రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. గ్రామ సర్పంచ్ గరిగంటి మౌనిక బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్..

చర్ల: ఓ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన చర్ల మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పశువైద్యశాల సమీపంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు వెళ్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని ట్రాక్టర్ బలంగా ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో ఆ ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్ ద్వారా చర్ల ప్రభుత్వ వైద్యశాలకు ఆ తర్వాత భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో గాయపడిన యువకులు మండలంలోని కందిపాడు గ్రామానికి చెందిన వారుగా భావిస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

నిధుల్లేక.. నీరసించి..

- వెంటాడుతున్న మౌలిక వసతుల కొరత
- నిరుపయోగంగా డయాలసిస్ సెంటర్
- ఆరోగ్య శ్రీ నిధులతోనే నిర్వహణ..
- ఇదీ ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి దుస్థితి



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని ఏడాది క్రితం వైద్యవిధాన పరిషత్‌లోకి మార్చారు. అదనంగా వైద్యులనూ నియమించారు. కానీ సదుపాయాలు కల్పించకపోవడంతోపాటు నిధులు ఇవ్వకపోవడంతో వైద్యం పూర్తిస్థాయిలో అందడంలేదు. దీంతో ఆరోగ్య శ్రీ సేవలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతోనే నిర్వహణ చేపట్టాల్సి వస్తోంది. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశాక మొత్తం 11 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. హాస్పిటల్ పాత భవనానికి మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. దీంతో రోజూ 800 వరకు ఓపీ నమోదవుతోంది. కానీ వైద్య, మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ఆస్పత్రి సామర్థ్యాన్ని బట్టి ఇంకా ఏఏ పోస్టులు అవసరమో గుర్తించి, అవసరమైన సిబ్బంది సంఖ్య లెక్కతేల్చి మంజూరు చేయాల్సి ఉంది.

అందుబాటులోలేని పరికరాలు

ప్రస్తుతం ఆస్పత్రిలో ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. కానీ వైద్య పరికరాలు లేవు. సీఏఆర్ఎం-1, డ్రిల్లింగ్ యంత్రం-1, డెంటల్ చైర్-1, స్లిప్ ల్యాంప్-1, ఏఆర్ మిషన్-1, మైక్రోస్కోప్-1, ల్యాప్రోస్కోపిక్-1 ఏర్పాటు చేయాల్సి ఉంది. జనరేటర్, అంబులెన్స్, ఆర్‌ఓ ప్లాంట్ కూడా అందుబాటులో ఉంచాలి. ఆస్పత్రిలో 9 నెలల కంటే ముందే పుట్టిన బిడ్డలకు వైద్యం అందించేందించేందుకు ఎస్‌బీఎస్‌యూ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. పరికరాలు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో రూ.లక్షలు వెచ్చించినా ఆ యూనిట్ నిరుపయోగంగా మారింది.

ప్రారంభంకాని డయాలసిస్ సేవలు..

ఇక్కడి ఆస్పత్రికి ఆరు నెలల క్రితం డయాలసిస్ సెంటర్ మంజూరు చేశారు. కానీ ఇప్పటివరకు డయాలసిస్ బాధితులకు సేవలు అందుబాటులోకి రాలేదు. దీంతో ఇల్లెందు, పరిసర ప్రాంతాల ప్రజలు డయాలసిస్ రోగులు నిత్యం ఖమ్మం వంటి ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో వ్యయప్రయాసలు తప్పడంలేదు. విద్యుత్ కోతల కారణంగా ఎక్స్‌రే, రేడియాలజీ సేవల్లో కూడా అంతరాయం కలుగుతోంది. జనరేటర్ సదుపాయం లేదు. సోలార్ సిస్టం ఉన్నా బ్యాటరీలు మరమ్మతుల దశకు చేరాయి. తాగునీటి బోరు మోటార్ ఏర్పాటు చేసినప్పటికీ ఆర్‌ఓ ప్లాంట్ లేదు. దీంతో తాగునీటి సమస్య వెంటాడుతోంది.



వైద్యనిపుణులు లేక నిరుపయోగంగా మారిన ఎస్‌బీఎస్‌యూ యూనిట్

పెరిగిన కాన్పులు

ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశాక ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులు, నలుగురు జనరల్ డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రసూతీ సేవలు పెరిగాయి. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెరుగుతోంది. 2022 డిసెంబర్‌లో 21 కాన్పులు, 2023 జనవరిలో 24, ఫిబ్రవరిలో 24, మార్చిలో నేటివరకు 10 వరకు కాన్పులు చేశారు. ఇక కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు డిసెంబర్‌లో రెండు, జనవరిలో 15, ఫిబ్రవరిలో 19, మార్చిలో 5 నిర్వహించారు.

ఆరోగ్యశ్రీపై దృష్టి పెట్టాం..



ప్రభుత్వ వైద్యశాల వైద్య విధాన పరిషత్‌లోకి మారినందున ఏ జబ్బు అయినా ఆరోగ్యశ్రీలోనే వైద్యం అందించాల్సి ఉంది. అందుకే ఆరోగ్యశ్రీ మీద దృష్టి పెట్టాం. ఆస్పత్రికి కొన్ని సదుపాయాల అవసరం ఉంది. ఆర్‌ఓ ప్లాంట్, జనరేటర్ సదుపాయం ఉంటేనే డయాలసిస్ యూనిట్ అందుబాటులోకి వస్తుంది. కరెంటు కట్ అయితే ఎక్స్‌రే, రేడియాలజిస్ట్ సేవలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం.

–డాక్టర్ శిరీష్, సూపరింటెండెంట్

సాగర్ నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో..

- మళ్లీ మొదటికొచ్చిన సాగునీటి సమస్య
- రైతుల ఒత్తిడితో తలలు పట్టుకుంటున్న అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న సీఈ శంకర్‌నాయక్

ఖమ్మంఅర్బన్: ఒకటి రెండు రోజులు సాగర్ జలాశయం నుంచి పాలేరు రిజర్వాయర్ వరకు 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినప్పటికీ ప్రస్తుతం మళ్లీ మందగించింది. ఇన్‌ఫ్లో తగ్గిపోవడం, పాలేరు జలాశయంలో నీరు లేకపోవడంతో దిగువకు సాగర్ నీరు విడుదల చేసే ప్రక్రియ సాఫీగా సాగడం లేదు. డిమాండ్ మేరకు నీరందకపోవడంతో పంటలెలా కాపాడుకోవాలోననే ఆందోళనలో రైతులు మునిగిపోయారు. నిరసన బాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా, పైనుంచి నీరు రాకపోవడం, రైతుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో జలవనరులశాఖ అధికారులు నీరు అందించే విషయంలో తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో పాలేరుకు రోజుకు కనీసం 5 వేల క్యూసెక్కులకు తగ్గకుండా నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అలా ఒకటి రెండు రోజులు నీరు వదిలారు. ఆ తర్వాత ఇన్‌ఫ్లో తగ్గడంతో ప్రస్తుతం పాలేరులో 16 అడుగులకు నీటిమట్టం చేరిందని అధికారులు చెబుతున్నారు. ఆదివారం నిర్వహించిన లెక్కల ప్రకారం 3,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తున్నట్లు తెలుస్తోంది. పాలేరు దిగువ ఆయకట్టుకు 4,200 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

వచ్చిన మేర అందించండి..

'సాగర్ నుంచి వచ్చే నీరు తగ్గిపోతోంది. దిగువకు డిమాండ్ ఎక్కువగా ఉంది. నిల్వ నీరు డెడ్ స్టోరేజీ దశకు వస్తోంది. ఇలాంటి పరిస్థితిలో ఇంజనీర్లు కష్టపడండి. కాల్వల వెంట తిరగండి. అవసరం ఉన్న మేరకు రైతులను ఉపయోగించుకోనివ్వండి' అని జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ సూచించారు. ఆదివారం నీటి సరఫరాపై తలెత్తుతున్న సమస్యలపై జిల్లా ఇంజనీర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కాల్వల వారీగా సాగు, నీటి అవసరం, రైతుల డిమాండ్.. తదితర అంశాలపై సమీక్షించారు. రైతులకు నచ్చజెపుతూ సీజన్ పూర్తయ్యే వరకు పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఖమ్మం, కల్లూరు ఎస్ఈలు నరసింగరావు, ఆనంద్ కుమార్, ఈఈలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచార్యులు, అనన్య, డీసీఈ ధన్‌కుమార్‌రెడ్డి, డీఎస్ఈ వెంకట్రామ్, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ



మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ సూచించారు. ఆదివారం నగరంలోని ఎస్సీ సంక్షేమ శాఖ బాలికల ఆనంద నిలయం, బాలుర-ఏ వసతిగృహాల్లో హాస్టల్ డే నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ఎస్సీ డీడీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఉన్న కొద్ది రోజుల సమయాన్ని వినియోగించుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కష్టపడాలని, విద్యార్థులకు పాఠ్యాంశాల్లో వచ్చే అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ట్యూటర్లను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయా వసతి గృహాల్లో విద్యార్థినీ, విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్సీడీఓ శ్రీలత, వసతిగృహ సంక్షేమాధికారులు టి.విజయలక్ష్మి, ఎస్.వెంకటరెడ్డి, కె.రుక్మారావు, వసతిగృహాల నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి లాంటి కేసీఆర్‌పై విమర్శలా?

- ఎమర్జెన్సీని తలపించేలా కేంద్రంలో బీజేపీ పాలన
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో ఏఒక్క వర్గాన్ని విస్మరించకుండా అందరి సంక్షేమం కోసం పని చేసే తండ్రి లాంటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హెచ్చరించారు. సత్తుపల్లిలోని మాధురి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి ప్రసంగించారు. ఏ రాజకీయ పార్టీయో తెలియకుండా స్వార్థ రాజకీయాలు చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలన ఎమర్జెన్సీని తలపించేలా ఉందని దుయ్యబట్టారు. నాలుగున్నరేళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్ సారథ్యంలో అక్టోబర్‌లో ప్రజాతీర్పు కోసం వస్తామని.. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ప్రభుత్వానికి దీవెనలందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, మండల, పట్టణ అధ్యక్షులు ఎస్‌కె రఫీ, యాగంటి శ్రీనివాసరావుతోపాటు వనమా వాసు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కట్టా అజయ్‌కుమార్, తుంబూరు కృష్ణారెడ్డి, లక్కినేని రఘు, మాధురి మధు, మట్టా ప్రసాద్, గ్రాండ్ మౌలాలీ, దాసరి శ్రీధర్‌రెడ్డి, మల్లూరు అంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

కూసుమంచి: మండలంలోని ఈశ్వరమాధారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పొలాలకు వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ఎరబోలు వెంకటరెడ్డి, గోపాలకృష్ణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

నేలకొండపల్లి: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన మల్లేశ్ (20) వారం రోజుల కిందట ఖమ్మం రూరల్ మండలం తెల్లారుపల్లి గ్రామం సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. కానీ, పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం గ్రామానికి చెందిన మునగాల ఎల్లయ్య (35) ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. కూలి పనులు చేసుకునే ఎల్లయ్య.. కొంతకాలంగా పనిలేకుండా తిరుగుతున్నాడు. కుటుంబాన్ని పోషించడం కష్టం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ భార్యతో ఘర్షణ పడుతుండేవాడు. తాగిన మైకంలో ఆదివారం పురుగులమందు తాగడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం – భీమవరం గ్రామాల మధ్య ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ సురేశ్ కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెద్దకొమెర గ్రామానికి చెందిన పోతురాజు రామకృష్ణ (43) శనివారం రాత్రి తన స్వగ్రామం నుంచి ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెం గ్రామంలోని తన బంధువుల ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో భీమవరం గ్రామానికి చెందిన శీలం వెంకటరెడ్డి తన భార్యతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. అయ్యవారిగూడెం – భీమవరం గ్రామాల మధ్య కల్వర్టు వద్దకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దకొమెరకు చెందిన పోతురాజు రామకృష్ణ (43) తీవ్ర గాయాలపాలవడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శీలం వెంకటరెడ్డి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి సోదరుడు పోతురాజు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు శీలం వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.



పోతురాజు రామకృష్ణ మృతదేహం


'రియల్' వెంచర్ల జోరు

రఘునాథపాలెం: నూతన కలెక్టరేట్ ప్రారంభంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. మండలంలోని వీవీపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతన కలెక్టరేట్ చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వెంచర్ల జోరు సాగుతోంది. అనేకమంది చుట్టుపక్కల వెంచర్లు వేసి ప్రభుతానికి చెల్లించాల్సిన పన్నులు, 10 శాతం పంచాయతీలకు గ్రీన్ బెల్ట్ స్థలం కేటాయించకుండానే అక్రమాల పర్వం సాగిస్తున్నారు. ఒకవైపు చెరువు భూములను ఆక్రమించి పక్కన సరిహద్దు సర్వే నంబర్లు వేసి ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరును గుర్తించిన జలవనరులశాఖ అధికారులు నగరంలోని ఖానాపురం ఊరచెరువు పరిధిలో 12 మంది బల్లేపల్లి సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించి రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులకు లేఖలు రాశారు. అదే తరహాలో వీవీపాలెంలో కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ సమీపంలోని పట్టా నెంబర్లు ఆనుకొని ఉన్న ఎన్నెస్పీ కాల్వ కట్ట భూములను ఆక్రమించి విక్రయిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఒక వైపు జిల్లా కలెక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. సాక్షాత్తూ కలెక్టరేట్ సమీపంలోనే ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి.

మారాను ఈ విధంగా..



నాడు ఆకులు రాలి మోడువారిన రావి చెట్టు(ఫైల్)



నేడు పచ్చగా కళకళలాడుతూ ఇలా..

నేనొక రావి చెట్టును. నేను కొత్తగూడెం ఎంజీ రోడ్డులో ఉంటున్నాను. రుతువులవారీగా నేను రకరకాలుగా కనిపిస్తుంటాను. ప్రస్తుతం శిశిరం ముగుస్తోంది కనుక పాత ఆకులన్నీ రాల్చేశాను. ఇది నా సహజ సిద్ధ లక్షణం.. కానీ, చూసేందుకు బాగోలేనని ఫొటో కొట్టేశారు. వసంతం రాబోతోంది గా.. యథావిధిగా చిగురించాను. లేలేత ఆకుపచ్చని ఆకులతో ఉండటంతో ఇప్పుడు చూసేందుకు బాగున్నాను కదా ఆదివారం 'సాక్షి' కెమెరా మరోసారి ఫొటో కొట్టింది..

–చుంచుపల్లి

డెంగీతో మహిళ మృతి

ఒకే గ్రామంలో రెండు రోజుల్లో ఇద్దరు



శ్రావణి (ఫైల్)

అశ్వాపురం: డెంగీతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెంది 24 గంటలు గడవక ముందే మరో మహిళ డెంగీతో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమెర్ద గ్రామానికి చెందిన నక్కా శ్రావణి(30), ఆమె భర్త శేఖర్, అత్తకు గత కొన్ని రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. వీరు ముగ్గురు గత ఐదు రోజుల క్రితం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. వీరిలో శ్రావణి భర్తకు జ్వరం తగ్గింది. కానీ శ్రావణి అత్యవస వైద్యం అందించాల్సి ఉండగా.. మెరుగైన వైద్యం కోసం ఆదివారం భద్రాచలంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందింది. ఆమె అత్త ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది. గ్రామానికి చెందిన మరో నలుగురు డెంగీతో భద్రాచలంలో ప్రైవేట్ ఆస్పత్రిలో, మరికొందరు పలు చోట్ల చికిత్స పొందుతున్నట్టు సమాచారం. గ్రామంలో జ్వరాలు విజృంభిస్తుండటంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించి, జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీ ఆస్పత్రి సీజ్..

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ డాక్టర్ అర్జున్ నిర్వహిస్తున్న గీత ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ నెల11న అమెర్దలో డెంగీతో మృతి చెందిన ఓ బీటెక్ విద్యార్థికి మూడు, నాలుగు రోజుల పాటు చికిత్స చేయడం, ఆరోగ్యం విషమించాక ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నాడని, పరిధి దాటి మందులు వాడుతుండడం వంటి కారణాలతో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు అసంక్రామ్య వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ మణికంఠారెడ్డి సీజ్ చేశారు. గ్రామంలో డెంగీతో విద్యార్థి మృతి చెందడంతో ఆదివారం వైద్యాధికారి సంకీర్తన ఆధ్వర్యాన అమెర్దలో వైద్య శిబిరం నిర్వహించగా.. మణికంఠారెడ్డితో పాటు జిల్లా మలేరియా సహాయ అధికారి గొంది వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా 12 మంది జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించి 65 మందికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, ఎంటీఎస్ అరుణ్‌బాబు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చిట్టీల నిర్వాహకుడి ఘరానా మోసం?

- సుమారు రూ.కోటితో పరార్

చర్ల: ఖాతాదారులకు చెల్లించాల్సిన సుమారు కోటి రూపాయలతో ఓ చిట్టీ నిర్వాహకుడు పరారైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఓ చిట్టీ నిర్వాహకుడు చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పలువురి వద్ద చిట్టీలు కట్టించి వారికి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకుండా మూడు నెలలుగా వాయిదా వేసుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో బాధితులు పలుమార్లు నిలదీసినప్పటికీ ఏదో సాకు చెబుతుండడంతో ఓ రోజు బాధితులే అతడిని పోలీస్‌స్టేషన్‌కు సైతం తీసుకెళ్లారు. ఈక్రమంలో తన వద్ద చిట్టీలు పాడిన వారు తిరిగి చెల్లించగానే ఇస్తానని చిట్టీ నిర్వాహకుడు చెప్పడంతో వదిలేశారు. కానీ గత పది రోజుల నుంచి అతడు కనిపించకుండాపోవడం, ఫోన్ నంబర్ స్విచ్ఛాఫ్ వస్తుంది. కాగా, ఈ విషయాన్ని బాధితులు పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు చర్యలు తీసుకోలేకపోతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిట్టీ నిర్వాహకుడు ఐపీ పెట్టనున్నట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతుండగా.. బాధితులు లబోదిబోమంటున్నారు.

తప్పిన కొద్దీ... 'చీట్స్'

అక్రమాలపుట్ట మార్గదర్శిలో నలుగురు మేనేజర్ల అరెస్టు ● ఒక్క రూపాయి కూడా లేకుండా కంపెనీ పేరిట వేలాది చిట్టీలు

సాక్షి, అమరావతి: సోదాలు చేస్తున్న కొద్దీ అక్రమాల పుట్టగా బయటపడుతున్న మార్గదర్శి చిట్ ఫండ్స్ వ్యవహారంలో అరెస్టులకు తెరలేచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు... నలుగురు బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసి ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఇప్పటికే ఏ1గా రామోజీరావును, ఏ2గా చెరుకూరి శైలజను, ఏ3గా బ్రాంచి మేనేజర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సీఐడీ... ఫోర్‌మన్లుగా పిలిచే కామినేని శ్రీనివాసరావు (విశాఖ– సీతమ్మధార బ్రాంచి), సత్తి రవి శంకర్ (రాజమండ్రి), బి.శ్రీనివాసరావు (విజయవాడ–లబ్బీపేట), గొరిజవోలు శివరామకృష్ణ (గుంటూరు)లను అరెస్టు చేసి ఆయా ప్రాంతాల్లో న్యాయమూర్తుల ఎదుట హాజరు పరిచారు. వీరిలో కొందరికి 24 వరకూ రిమాండు విధించారు. ఈ సందర్భంగా వెలుగుచూసిన అక్రమాలు అధికారులను సైతం దిగ్భ్రాంతికి గురిచేశాయి. చిట్ సభ్యుల స్థానంలో వేల చిట్లలో తమ పేరే రాసేసుకున్న మార్గదర్శి సంస్థ... నిబంధనల మేరకు దానికి పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు!!. చిట్లలో తనకు వచ్చే కొద్ది పాటి డిస్కౌంట్ల మొత్తాన్నే దాదాపు అన్ని చిట్లలోనూ డూప్లికేట్ చేసి చూపించి... దాన్నే తమ సొమ్ముగా పేర్కొనటంతో, ఇదంతా పచ్చి 'గొలుసు' వ్యవహారంగా మారిపో యింది. గొలుసులో ఏ చిన్న లింకు తెగి నా... ఇది సంస్థ దివాలాకు దారి తీసే ప్రమాద ముంది. అదే జరిగితే చిట్ సభ్యుల సొమ్ము వాళ్లకు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్త మవుతోంది. దీంతోపాటు చిట్లలకు వేర్వేరు బ్యాంకు ఖాతా లను నిర్వహించాల్సి ఉండగా... అన్నిటికీ ఒకే ఖాతాను నిర్వహిస్తూ వాటిలో డబ్బును ఇష్టం వచ్చినట్టుగా మళ్లించటం కూడా విస్మయం కలి గిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో గ్రూపు సంస్థల్లోకి కోట్లాది రూపాయలు మళ్లిస్తుండటంతో పాటు... హైరిస్క్ ఉండే మ్యూచ్‌వల్ ఫండ్స్‌లోకి కూడా ఈ ఖాతా నుంచి చిట్ సభ్యుల సొమ్మును మళ్లించటం గమనార్హం. వీటన్నిటితో పాటు... చట్ట విరుద్ధ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసే సినా డిపాజిట్లు తీసుకోవటం మాత్రం రామోజీ రావు ఆపలేదని తాజా సోదాల్లో వెల్లడయింది. చిట్ సభ్యుల నుంచి అక్రమంగా డిపాజిట్లు తీసుకుంటూ... బ్యాంకుల్లో అయితే వాటిపై టీడీఎస్ (ఆదాపు పన్ను) చెల్లించాలని, తమ దగ్గరైతే అలాంటిదేమీ ఉండదని నమ్మబలుకుతుండటం మోసాలకు పరాకాష్టగా అధికారులు చెబుతున్నారు. ఆ అక్రమాల వివరాలివీ...

ఒక్క రూపాయి చెల్లించకుండా... తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్దిష్ట చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని 27, 32 సెక్షన్లలో నిర్దేశించిన ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. కానీ వాటికోసం మార్గదర్శి ఇప్పటిదాకా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు ప్రతికూలించి కొన్ని గ్రూపుల్లో చిట్ల సభ్యులు తమ చందా చెల్లించలేకపోతే... ఇక మిగతా వాళ్లకు చిట్లు పాడుకున్నా సరే డబ్బులు రావటం కష్టం. ఎందుకంటే కంపెనీ పేరిట ఉన్న వేటికీ డబ్బులు లేవు కాబట్టి!!.

ఇదిగో ఉదాహరణ.... ఎంసీఎఫ్ గుంటూరు బ్రాంచిలో 45 గ్రూపుల చిట్టీలు వేశారు. వాటిలో మొత్తం 2,040 టికెట్లు (చందాదారులు) ఉన్నాయి. 858 టికెట్లు మార్గదర్శివే. వాటి చందాగా మార్గదర్శి రూ.16.96 కోట్లు చెల్లించాలి. కానీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని బ్రాంచి మేనేజర్(ఫోర్‌మేన్) అంగీకరించారు. కేవలం రికార్డుల్లో ఎంట్రీలను అటూ ఇటూ జంబ్లింగ్ చేసి చూపిస్తోంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ మొత్తంగా 2,300 చిట్టీలను నిర్వహిస్తోంది. వాటిలో లక్షమందికిపైగా చందాదారులున్నారు. వాటిలో కొన్ని వేల టికెట్లు మార్గదర్శివే. కానీ సంస్థ యాజమాన్యం తన వాటాగా ఒక్క రూపాయి కూడా పెట్టలేదు. గొలుసు కట్టు మాదిరిగా ఒక చిట్ సొమ్మును వేరే చోట సర్దుబాటు చేస్తూ... కొందరికి ష్యూరిటీల పేరిట ఆలస్యం చేస్తూ... మరికొందరికి డిపాజిట్ల పేరిట తరవాత ఇస్తామని చెబుతూ రోజులు నెట్టుకొస్తోంది. అదీ కథ.

ఒక్క బ్యాంకు ఖాతా చాలట!!

చిట్‌ఫండ్ సంస్థలు తమ నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. చిట్టీల ఒప్పందాల్లో బ్యాంకు పేరును చెబుతోంది తప్ప ఖాతాల నంబర్లు, ఇతర వివరాలను ఇవ్వటమే లేదు. ప్రతి చిట్టీకీ ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉండాల్సి ఉండగా... దాన్నీ పాటించటం లేదు. అన్నీ ఒకే బ్యాంకు ఖాతాలో భారీగా పోగేస్తోంది. నిజానికిదో పెద్ద ఆర్థిక కుట్ర. నిబంధనల ప్రకారం చిట్టీల బ్యాంకు ఖాతాలపై సదరు బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మేన్)కు చెక్ పవర్ ఉండాలి. ఆ మేనేజరే అన్నీ చూడాలి. కానీ మార్గదర్శిలో ఏ బ్రాంచి మేనేజర్‌కూ చెక్ పవర్ లేదు. అంతా హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచే నడిపిస్తున్నారు. అక్కడ ఒకరికే చెక్ పవర్ కల్పించడం వెనుక గూడుపుఠాణి ఏమంటే... ఆ ఖాతా నుంచి నిధులు మళ్లించటం ఈజీ కనక. మ్యూచువల్ ఫండ్స్, ఇతర స్టాక్ మార్కెట్ సాధనాల్లో పెట్టుబడి పెట్టడం నేరమైనా... మార్గదర్శి చేస్తున్నది అదే. తమ గ్రూపు సంస్థ ఉషోదయ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5శాతం వాటాను మార్గదర్శి చిట్స్ కొనుగోలు చేసింది. ఇతర సంస్థల్లోకీ అక్రమంగా నిధులు మళ్లించింది. హైరిస్క్ ఉన్న వీటిలో పెట్టుబడులు పెడుతున్నట్లు చందాదారులకు కనీసం తెలియకుండా... దశాబ్దాలుగా రామోజీ సాగిస్తున్న ఆర్థిక దోపిడీ ఇది.

డిపాజిట్లు సేకరించటం నేరమే అయినా...

చిట్టీ పాడిన చందాదారుడికి చిట్టీ మొత్తం చెల్లించినట్టుగా చిట్స్ రిజిస్ట్రార్‌కు చూపిస్తున్న మార్గదర్శి... ఆ చందాదారుడికి పూర్తిగా చెల్లించకపోవటం గమనార్హం. ష్యూరిటీలు సరిగా లేవన్న కారణాలతో పలువురు చందాదారుల నుంచి ఫ్యూచర్ సెక్యూరిటీ పేరిట మిగిలిన కాలానికి చెల్లించాల్సిన చందాను తమ వద్దే ఉంచుకుంటున్నారు. దానికి ఓ రశీదు ఇస్తున్నారు. దానిపై 4–5 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఇలా డిపాజిట్లు సేకరించటం చట్టప్రకారం నేరం. రామోజీ మాత్రం అదేమీ పట్టించుకోవటం లేదు. దానికి ఇదిగో ఉదాహరణ...

ఒకే వ్యక్తి నుంచి రూ.కోటికిపైగా అక్రమ డిపాజిట్లు

మార్గదర్శిలో ఓ చందాదారునికి 24 చిట్టీలున్నాయి. ఆయన నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ 'రశీదు' రూపంలో రూ.కోటికు పైగా డిపాజిట్లు వసూలు చేసింది. దీనిపై ఆ సభ్యుడిని విచారించగా విస్మయకర అంశాలు వెల్లడయ్యాయి. టీడీఎస్ మినహాయించుకోకుండా తాము డిపాజిట్లు సేకరిస్తున్నామని మార్గదర్శి చిట్స్ తనకు చెప్పిందని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే టీడీఎస్ చెల్లించాలి. అదే మార్గదర్శిలో అయితే టీడీఎస్ అవసరం లేదని చెప్పి ఆయన్ని ఆకర్షించారు. ఇది ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నేరం. నిజానికి గతంలో మార్గ దర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఎలాంటి అనుమతు లూ లేకుండా రూ.2,600 కోట్లు డిపాజిట్లుగా వసూలు చేశారు. దీన్ని నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్‌కు మార్ బయటపెట్టడంతో కేసులు నమోద య్యాయి. విచిత్రమేంటంటే కేసులు కొనసాగు తుండగా... నేరాన్ని కప్పిపుచ్చుకోవటానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను రామోజీ రావు మూసేశారు. ఇలా డిపాజిట్లు సేకరించటం ఐటీ చట్టం ప్రకారం నేరం. ఎంత సేకరి స్తే అంత మొత్తాన్ని పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐటీ కూడా రామోజీకి నోటీసులు జారీ చేసింది. దానిపైనా పలు కేసులు నడుస్తున్నాయి. అలాంటి సమయంలో సంస్థను కుట్రపూరితంగా మూసేయ టమే కాక... ఇపుడు చిట్స్ ముసుగులో రకరకాల పేర్లతో డిపాజిట్లు సేకరిస్తుండటం గమనార్హం.

మేనేజర్ల పేరిట మరో పన్నాగం...

అవినీతి బాగోతం బయటపడే సమయంలో దానికి సాంకేతిక కారణాలు చూపించి తప్పించుకోవటంలో రామోజీది అందెవేసిన చెయ్యి. అదే తరహాలో చిట్స్ విషయంలోనూ ఈ ఉల్లంఘనలన్నింటినీ తమ బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్) నెత్తిన రుద్దీ తప్పించుకునే దుర్మార్గానికి తెరతీశారు రామోజీ. కానీ స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఈ కేసును శాస్త్రీయంగా అధ్యాయనం చేసి... తగిన ఆధారాలు సేకరించడం ద్వారా రామోజీ ఎత్తును చిత్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు బయటపడగానే రామోజీరావు తన ఈనాడు పత్రికలో అరపేజీ ప్రకటన ఇచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు సంబంధించి అన్ని వ్యవహారాలు బ్రాంచి మేనేజర్లే మాత్రమే చూస్తారు ...సర్వాధికారాలు వారివేనని అందులో పేర్కొన్నారు. అంతేకాదు తెలంగాణ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో అదే మాట చెప్పారు. తద్వారా బ్రాంచి కార్యాలయాల్లో అక్రమాలతో తనకు సంబంధం లేదని చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేశారు. కానీ స్టాంపులు– రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ విభాగాలు రామోజీరావు కుట్రను సమర్థంగా తిప్పికొట్టాయి. ఎందుకంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు కేవలం నిమిత్త మాత్రులు. వారికి తమ బ్రాంచిలోని ఖాతాలకు సంబంధించి కనీసం చెక్ పవర్ కూడా లేదు. అంటే వారికి సర్వాధికారాలు ఉన్నాయని రామోజీ ఇచ్చిన ప్రకటనలో గానీ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో గానీ చెప్పినవన్నీ అబద్ధాలేనన్నది స్పష్టమైంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అన్ని అక్రమాలకు రామోజీరావు, ఆయన కోడలు శైలజే పూర్తి బాధ్యులనేది సుస్పష్టం.

జెండాను గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు కృతజ్ఞతలు

● పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్



సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. '12 వసంతాలు పూర్తి చేసుకుని, నేడు 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభిమానులకు, కార్యకర్తలకు, నాయకులకు, రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. గత 12 ఏళ్లుగా ప్రయాణంలో నాతో నిలబడి, నాకు వెన్నుదన్నుగా ఉన్న ప్రతి ఒక్కరికీ, మన పార్టీ జెండాను తమ గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు. మన ప్రయాణం ఎప్పటికీ ఇలాగే కొనసాగుతూ ఉండాలని కోరుకుంటున్నాను' అని ఆదివారం ట్వీట్ చేశారు.



ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు వైఎస్సార్‌సీపీ ఓ రోల్ మోడల్ అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీని దేశంలోనే ఆదర్శవంతమైన పార్టీగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సజ్జల.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మరోవైపు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు, నేతలు పండగలా నిర్వహించారు.

ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుంది

● అరెస్టు చేస్తే చేయనివ్వండి.. నేను అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా
● కడపలో మీడియాతో వైఎస్ భాస్కర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
● వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ విచారణ కోసం హాజరైన భాస్కర్‌రెడ్డి



కడప అర్బన్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కీలకమైన ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 12న తమ ముందు విచారణకు హాజరుకావాలని సీబీఐ అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆయన కడప కేంద్రకారాగారంలోని గెస్ట్‌హౌస్‌లో ఉన్న సీబీఐ అధికారుల ముందు హాజరయ్యేందుకు వెళ్లారు. అక్కడ సీబీఐ అధికారులెవరూ అందుబాటులో లేరు. మళ్లీ నోటీసులు ఇస్తామని, అప్పుడు విచారణకు హాజరుకావాలని అక్కడి సిబ్బంది సూచించడంతో ఆయన వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే అవినాశ్‌రెడ్డి అన్ని విషయాలు చెప్పారని, తాను చెప్పేదేమీ లేదని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం సహకరించకపోయినా విచారణకు సహకరించాలనే ఉద్దేశంతో వచ్చానన్నారు. విచారణ అధికారులు అందుబాటులో లేరని, మరోసారి నోటీసులు ఇస్తామని చెప్పారని తెలిపారు. తిరిగి తనకు నోటీసులు ఇస్తే విచారణకు వస్తానని స్పష్టం చేశారు. ఈ కేసు పరిష్కారం కావాలంటే వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో వెలుగుచూసిన లేఖ బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లేఖ బయటకు వస్తేనే అన్ని విషయాలు బయటకొస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో తాను ఇంతకంటే ఏమీ చెప్పలేనని వ్యాఖ్యానించారు. అరెస్టుపై జరుగుతున్న ప్రచారంపైన కూడా ఆయన స్పందించారు. కేసు తప్పుదోవ పట్టిస్తున్నారని చెబుతూ.. 'అరెస్టు చేసుకుంటే చేసుకోండి, అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా..' అని చెప్పారు.

జిల్లా వార్తలు

పట్టాభిషేకానికి 'శ్రీరామ పుష్కరిణి' తీర్థం



శ్రీరామ పుష్కరిణి జలంతో అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి అర్చకులు ఆదివారం శ్రీరామ పుష్కరిణి తీర్థాన్ని సేకరించారు. 12 నదీ జలాలు, పుణ్య సరస్సుల జలాలను సేకరించేందుకు ఆలయ అర్చక బృందం దేశంలోని నాలుగు దిక్కులకు వెళ్లిన సంగతి విదితమే. ఇందులో భాగంగా ఆదివారం దక్షిణ వైపున గల తిరువనంతపురం పద్మనాభ దివ్యక్షేత్రంలోని శ్రీరామ పుష్కరిణి తీర్థాన్ని పొడిచేటి రామభద్రాచార్యులు, పొడిచేటి సీతారామాచార్యులు కలశంలో తీసుకున్నారు. అలాగే పశ్చిమ దిక్కు తీర్థ సేకరణలో భాగంగా గుజరాత్ రాష్ట్రంలోని ద్వారకా నగర సమీపంలోని గోపితలాబ్ వద్ద నున్న గోపి సరస్సు నుంచి అమరవాది మురళీకృష్ణమాచార్యులు, కలకోట పవన్‌కుమారాచార్యులు తీర్థాన్ని సేకరించారు.

ఉత్సాహంగా జాతీయ కరాటే టోర్నీ



కరాటేలో తలపడుతున్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: సందేశ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వర్తక సంఘం భవన్‌లో పల్లా జాన్‌రాములు జ్ఞాపకార్థం జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పి.సర్వయ్య మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే ఉపయోగ పడుతుందని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు సైతం కరాటే నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా దీనిపై శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. అనంతరం పల్లా కిరణ్‌కుమార్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు ముంబయి, బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 800 మంది కరాటే విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో విన్‌ఫీల్డ్ డైరెక్టర్లు శ్రీకాంత్, కిషోర్, కరాటే అసోసియేషన్ చీఫ్ హనీ హాసన్, సౌత్‌ఇండియా చీఫ్‌లు షావద్ సయ్యద్, టోర్నీ ఆర్గనైజర్, కరాటే మాస్టర్ కందాల సందేశ్ పాల్గొన్నారు.

సంఘాల ప్రగతిపై ఆరా..!

ఎస్‌హెచ్‌జీ సభ్యుల కోసం లఖ్‌పతి దీదీ యాప్

● సమాచారమంతా ఒక్కచోటే
● సెర్ప్ అధికారులకు ఊరట
● జిల్లాలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
● ప్రగతి ఆధారంగా భవిష్యత్తు రూపకల్పన



ఖమ్మంమయూరిసెంటర్/చుంచుపల్లి: స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. సంఘాలు, సంఘాల సభ్యులకు సంబంధించిన ప్రతి అంశాన్ని యాప్‌లో పొందుపరిచేలా రూపొందించారు. యాప్‌లో సమాచారం నమోదు చేసే ప్రక్రియ జిల్లాలో కొనసాగుతుంది. మహిళా సభ్యులు ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘాల పనితీరును తెలుసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం సంఘాల ప్రగతిపై ఆరా తీసేందుకు లఖ్‌పతి దీదీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ పూర్తి స్థాయిలోకి వినియోగంలోకి వచ్చిన తర్వాత మహిళా సభ్యులకు సొంతంగా ఆదాయం పెరిగేందుకు సెర్ప్ అధికారులు ప్రోత్సాహాలను చూపించనున్నారు.



సమాచారమంతా నిక్షిప్తం..

స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన ఎలాంటి వివరాలు తెలుసుకోవాలన్నా.. సెర్ప్‌లోని పలు విభాగాల నుంచి డేటాను సేకరించాల్సి ఉంటుంది. ఇందులో ఐబీ నుంచి సంఘాలు, సంఘ సభ్యుల వివరాలు, స్త్రీనిధి నుంచి రుణాలకు సంబంధించి బ్యాంక్ లింకేజీ, మహిళా సంఘాల వ్యాపారాల గురించి మరో విభాగం నుంచి.. ఇలా ఒక్కో విభాగం నుంచి ఒక్కో సమాచారం సేకరించాలంటే నానా అవస్థలు పడాల్సి వచ్చేది. కానీ, నూతనంగా తీసుకొచ్చిన యాప్‌లో సెర్ప్ సిబ్బంది సంఘం, సంఘ సభ్యురాలి పూర్తి వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. సంఘాల్లోని సభ్యుల జీవన స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితులు, బ్యాంకు అనుసంధాన రుణాలు, స్త్రీ నిధి రుణాలు వాటి వాయిదాల చెల్లింపు.. ఇలా ప్రతీ విషయాన్ని దీనిలో నిక్షిప్తం చేస్తున్నారు. దీన్ని ఆధారంగానే సంఘాల ప్రగతికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణను అధికారులు రూపొందించనున్నారు.

జిల్లాల్లో ఎస్‌హెచ్‌జీలు, సభ్యులు, సర్వే జరుగుతున్న వివరాలు ఇలా..

	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
జిల్లాలో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉన్న కుటుంబాలు	2,46,519	1,66,641
ఇప్పటి వరకు సర్వే పూర్తయిన కుటుంబాలు	1,40,770	99,979
జిల్లాలో ఎస్‌హెచ్‌జీల సంఖ్య	25,845	18,352
సర్వే కోసం సీఆర్‌పీలకు అప్పగించిన సంఘాలు	24,158	18,000
సర్వే పూర్తయిన సంఘాలు	9,940	8,600
పాక్షికంగా సర్వే పూర్తయిన సంఘాలు	6,498	3,600
సర్వే మొదలు కాని సంఘాలు	7,720	5,800

మానవాళికి దిక్సూచి..ఖురాన్



మాట్లాడుతున్న గయాస్ అహ్మద్ రషాదీ

ఖమ్మంమామిళ్లగూడెం : మానవ జీవిత నౌకకు ఖురాన్ దిక్సూచి అని మదర్సా ఇస్లామియా దారుల్ ఉలుమ్ ఆలిండియా అధ్యక్షుడు ఎండీ గయాస్ అహ్మద్ రషాదీ, హదీస్ మౌలానా అహ్మద్ ఉబైదుర్ రెహమాన్ అతర్ ఖాస్మీ తెలిపారు. ఖమ్మం కాల్వొడ్డులో మదర్సా ఇస్లామియా దారుల్ ఉలుమ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ధార్మిక సభలో వారు మాట్లాడారు. ఖురాన్ ఆలంబనతో మానవులు సుఖ, సంతోషాలు శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతాయని అన్నారు. దేశంలో శాంతియుత వాతావరణం ఏర్పడేలా మదర్సాలు, ఉలామాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. సభలో మదర్సా వైస్ చైర్మన్ ఎండీ.జవ్వాద్ అహ్మద్, దారుల్ ఉలుం మదర్సా కరస్పాండెంట్ మౌలానా సయిాద్ అహ్మద్ ఖాస్మీ, మదర్సా ఇస్లామియా ఇందాదుల్ ఉలుమ్ ఖమ్మం బ్రాంచ్ నిర్వాహకులు మౌలానా హఫీజ్, ఎండీ జలాలుద్దీన్ ఖాస్మీ, మౌలానా అబ్దుల్ మజాహరి, మౌలానా ఆసీఫ్ మజాహరి, సత్తార్ ఖాస్మీ, ఖాజీముఫ్తి అహ్మద్ ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సమస్త మానవాళికి ఆదర్శం ఖురాన్

ఖమ్మంమామిళ్లగూడెం : సమస్త మానవాళికి ఖురాన్ దివ్య గ్రంథం ఆదర్శమని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ బాసిత్ అన్వర్ అన్నారు. ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రంజాన్ స్వాగత సభలో ఆయన మాట్లాడారు. ఈ మాసంలో ఖురాన్‌ను ఏకాగ్రతతో పఠించాలని, ఉపవాసం ఉండాలని సూచించారు. దానధర్మాలు చేయాలని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్, ఫారూఖీ, హఫీజ్ సలావుద్దీన్ ముస్తఖ్‌అలీ, జిల్లా అధ్యక్షుడు అబ్రార్ అలీ, అబ్దుల్ ముజీబ్, ఖలీల్ అహ్మద్ ఖాన్, సుబూర్, జమీల్ అహ్మద్ ఖాన్, నిహాల్ అహ్మద్, రఫీ, మునీర్ జైనుల్ పాషా, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నివాస స్థలాలూ పంట భూములే..!

● ధరణిలో నమోదు చేసిన అధికారులు
● రైతుబంధు సాయం కూడా పొందుతున్న వైనం
● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారసులు

నేలకొండపల్లి: ప్రజలు నివాసం ఉండే స్థలాలను కూడా వ్యవసాయ భూమిగా చూపి రైతుబంధు సాయం పొందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సదాశివాపురంలో 1972లో కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన బుగ్గవీటి కోటయ్య, అనాసాగారం గ్రామానికి చెందిన మరో ఇద్దరు రైతుల నుంచి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాల కోసం 454లో సర్వే నంబర్‌లో 4.20 ఎకరాల భూమి సేకరించారు. దాని పక్కనే కోటయ్యకు చెందిన 1.20 ఎకరాల భూమి ఉంది. అయితే ఈ భూమితో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన భూమిని కూడా వ్యవసాయ భూమిగా నమోదు చేశారు. సాదాబైనామా ద్వారా ధరణిలో కూడా ఒక మహిళ పేరు మీద నమోదు చేశారు. ఇప్పుడు ఈ మొత్తం భూమికి ప్రభుత్వం అందించే రైతుబంధు సాయం పొందుతున్నారు. ఏళ్ల తరబడి ఆర్థిక సాయం అందుతున్నా సంబంధిత అధికారులు కనీసం క్షేత్ర స్థాయి విచారణ లేకుండా ఎలా ఎంపిక చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఊరినే ఏకంగా ధరణిలో వ్యవసాయ భూమిగా నమోదు చేశారంటే అధికారుల పని తీరు అర్థం చేసుకోవచ్చు. ఈ వింత లీలలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఈ విషయం పై అసలు భూమి వారసులు వారి 1.20 భూమిని ఇప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



సదాశివాపురం గ్రామం

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



గతంలో గ్రామంలో మా తాత కోటయ్య నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చిన తరువాత మాకు ఇంకా 1.20 భూమి ఉంది. కానీ ఆ భూమిని కూడా కాంతమ్మ పేరున ధరణిలో నమోదు చేశారు. అయితే ఆ భూమి నాది కాదని కాంతమ్మ లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. దీనిపై కలెక్టర్ ఫిర్యాదు చేశాను. మా భూమి మాకు ఇప్పించాలి. అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– బుగ్గవీటి రవీంద్రనాథ్, వారసుడు

పథకం నిలిపివేయాలని లేఖ రాశా



454 సర్వేలో ఊరు ఉన్నట్లు గుర్తించాం. గతంలో ఎలా జరిగిందో తెలియదు. తెలిసిన వెంటనే కలెక్టర్‌కు తెలియజేశాం. రైతుబంధు నిలిపివేయాలని లేఖ రాశాను. మా సర్వేలో రెండెకరాలను గుర్తించాం. చర్యలు తీసుకుంటాం.

– దారా ప్రసాద్, తహసీల్దార్, నేలకొండపల్లి

ప్రజాసేవలో ఉంటే రాజకీయాల్లో ఉన్నట్లే..

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్



మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్

బూర్గంపాడు: ప్రజాసేవలో ఉంటే రాజకీయాల్లో ఉన్నట్లేనని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సారపాకలో మున్నూరు కాపు సంఘం మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ మానవత్వంతో ముందుకు సాగాలని సూచించారు. కొత్తగూడెం కేంద్రంగా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జీఎస్ఆర్ ట్రస్ట్‌తో ఏడాది కాలంగా జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరిచి ప్రజాసేవలో ముందుంటామని చెప్పారు. మున్నూరు కాపుల ఆర్థిక స్వావలంబనకు, రాజ్యాధికారం కోసం ఐక్యంగా పనిచేయాలన్నారు. అదే సమయంలో ఇతర కులాలు, మతాల వారిని గౌరవిస్తూ వారికి తోడ్పాటునందించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మున్నూరు కాపులకు కొంతమేర మేలు జరుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో కాపులంతా ఐక్యంగా తమ జాతి మనుగడ కోసం, అస్తిత్వం కోసం పనిచేయాలన్నారు. మున్నూరు కాపులలో ఉన్నత స్థాయికి చేరిన వారు పేదల బాగోగులు పట్టించుకోవాలన్నారు. మున్నూరు కాపుసంఘం మండల అధ్యక్షులు వారాల వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, మండల మున్నూరు కాపుసంఘాల నాయకులు పాల్గొన్నారు.